క్లుప్తంగా

16 నుంచి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం): చిన్నబజారు రాజేంద్ర నగర్‌లోని మురళీకృష్ణ దేవస్థానంలో ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు కృష్ణజయంతి వసంత నవాహ్నిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని మురళీకృష్ణసేవా సంఘం ప్రధాన కార్యదర్శి మోహన ఆచారి శుక్రవారం తెలిపారు. 16వ తేదీ శనివారం సాయంత్రం అంకురార్పణ, అఖండజ్యోతి ప్రజ్వలనంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.

రక్షాబంధన్‌ను ఆనందంగా జరుపుకోవాలి


ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆత్మీయ బంధానికి, అనురాగానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని మాజీ పార్లమెంట్ సభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జిల్లా ప్రజలకు రాఖీ పండగ శుభాకాంక్షలు తెలిపారు.

రూ.22.90 కోట్ల చెక్కు అందజేత


నెల్లూరు(అర్బన్): తమ బ్యాంక్ బ్రాంచ్‌లు 2024–25 సంవత్సరానికి రూ.400 కోట్ల నికర లాభం వచ్చిన నేపథ్యంలో రూ.22.90 కోట్లను సామాజిక సేవలో భాగంగా కేంద్రానికి అందజేసినట్లు నెల్లూరు రెప్కో బ్రాంచ్ చీఫ్ మేనేజర్ జె.రవికిశోర్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన నెల్లూరులోని వారి బ్రాంచి కార్యాయలయంలో మాట్లాడారు. తమ బ్యాంకు చైర్మన్ సంతానం, డైరెక్టర్ తంగరాజు, ఎండీ ఓఎఫ్ గోకుల్‌లు రెండు మూడు రోజుల క్రితం ఢిల్లీలో హోమ్ మంత్రి అమిత్‌షాను కలిసి నగదు చెక్కును అందించారని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- రైతుబజారు సబ్‌స్టేషన్ పరిధిలోని రామచంద్రాపురం, ఎఫ్‌సీఐ కాలనీ, నజీర్‌తోట, రాయపుపాళెం పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు.. వైఎంసీఏ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆచారివీధి, రాయాజీవీధి, ముంగమూరివారి వీధి, ట్రంకురోడ్డు, పోస్టాఫీస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయి.
- రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మనుమసిద్దినగర్, పుత్తా ఎస్టేట్, గుప్తాపార్క్, ఈద్గామిట్ట, పొర్లుకట్ట, ములుమూడి బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. రంగనాథం సబ్‌స్టేషన్ పరిధిలోని ఇసుకడొంక, రంగనాయకులపేట, కపాడిపాళెం, సంతపేట, రైల్వేఫీడర్స్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.
- హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలోని హరనాథపురం, పినాకినీ అవెన్యూ, ఆకుతోట, సర్వేపల్లి కాలువకట్ట, చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు, అయోధ్యనగర్, మధురానగర్, అపోలో హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. సరస్వతీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో సరస్వతీనగర్, రామ్‌నగర్, పాత మిలటరీ కాలనీ, క్రాంతినగర్, టెక్కేమిట్ట, ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు.. ఇరుగాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలోని శాంతి నగర్, బట్వాడిపాళెం సెంటర్, రామయ్యబడి వీధి, ఏసీబీ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయన్నారు.
- **వెంకటేశ్వరపురం** సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరపురం, పునరావాస కాలనీ, పోస్టాఫీసు వీధి, అంబేద్కర్ కాలనీ, ఇస్లామ్‌పేట, లక్ష్మీస్ట్రీట్, నల్లకాలువ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 11.30 వరకు అంతరాయాలు ఉంటాయి.
- **నెల్లూరు(అర్బన్):** రూరల్ మండలం బుజబుజనెల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, గొల్లపాళెం, అంబేద్కర్‌నగర్, భగత్‌సింగ్ కాలనీ, కళాకారుల కాలనీ, శివాజీ నగర్, నాగమ్మకాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ రాజబాబు తెలిపారు.

వాటర్ కూలర్ వితరణ



నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డు గౌతమీనగర్‌లోని హరిత వృద్ధాశ్రమానికి బాప్టిస్టు చర్చి డొనీహాల్ 'షో యువర్ లవ్ అగాపె' టీమ్ సౌజన్యంతో వాటర్‌కూలర్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులు ఎం.కృపారాజన్, దంతం రవి, పెంచలయ్య, మేరీ సరళ, జువితా విలియమ్స్, మేరీ బ్లెస్సింగ్టన్, షీలా మోసెస్, హేమలత, శేషమ్మ, నిర్వాహకులు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


రాజరాజేశ్వరి సన్నిధిలో సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు


ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో..

శ్రావణ శోభితం

నెల్లూరు(బృందావనం): శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా నగరంలోని వివిధ ఆలయాల్లో విశేష రూపాల్లో కొలువైన జగన్మాతకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


మూలస్థానేశ్వరాలయంలో..


కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..

- రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారు అనివెట్టి మండపంలో లక్ష్మీదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. అమ్మవారికి పూలంగిసేవ, పల్లకిసేవలను అర్చకుడు సూరావఝుల రఘురామమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా చేగు సత్యనారాయణగుప్తా, రమణకుమారి, చెక్కా సాయిసునీల్ వ్యవహరించారు. కార్పొరేటర్ అహల్య, కోటంరెడ్డి సుజిత, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఈఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షించారు.
- ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఉదయం వరలక్ష్మివ్రతం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, పూలంగిసేవ, చందనాలంకారం, పల్లకిసేవలు జరిపారు. ఉభయకర్తలుగా పి.చంద్రశేఖర్, శివప్రసన్న, పి.సోమశేఖర్‌శర్మ, మహేశ్వరి, గంగిశెట్టి సాయికుమార్, నిధి వ్యవహరించారు. ఈఓ గిరికృష్ణ పర్యవేక్షించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో వరలక్ష్మివ్రతం నిర్వహించారు. ఈ క్రమంలో అమ్మవారు గాజుల అలంకారంలో దర్శనమిచ్చారు. మందిర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కొప్పరపు శివప్రసాద్, త్యాగరాజ కల్యాణ మండపం నిర్వాహకులు అమరా మోహన్‌రావు, ఎస్.హనుమంతరావు పాల్గొన్నారు.
- స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వరలక్ష్మివ్రతం, కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారు బంగారు చీరలో భక్తులను అనుగ్రహించారు. వెండిరథంపై అమ్మవారి ఊరేగింపు జరిగింది. ఉభయకర్తలుగా వసంతకుమార్, సుజాత, అనుమాలశెట్టి హరగోపాల్, శైలజకుమారి, సాయిశ్రీహర్ష, ప్రవల్లిక, రవితేజ, సీతశ్రీ వ్యవహరించారు. పాలకమండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి జనార్ధన్, గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.
- మూలాపేటలోని మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో వరలక్ష్మి వ్రతం, పల్లకిసేవ, ఊంజల్‌సేవలు విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా వరిదిరెడ్డి కృష్ణమోహన్‌రెడ్డి వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.
- నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని నరసింహకొండపై వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారికి పల్లకి సేవ, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఉభయకర్తలు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.


రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో క్యూలైన్‌లో బారులు దీరిన భక్తులు


వ్రతం ఆచరిస్తున్న మహిళ


బాలాజీనగర్ సీతారామస్వామి మందిరంలో..


వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..

'హర్ ఘర్ తిరంగా'ను విజయవంతం చేద్దాం

- కమిషనర్ నందన్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ నందన్ ఇతర అధికారులు

నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 'హర్ ఘర్ తిరంగా– హర్ ఘర్ స్వచ్ఛత' కార్యక్రమాన్ని నగర పరిధిలో విజయవంతం చేద్దామని కమిషనర్ నందన్ పిలుపునిచ్చారు. కార్పొరేషన్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో పలువురు అధికారులతో కలిసి సంబంధిత పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ సంబరాల్లో ప్రజలందరినీ మమేకం చేస్తూ స్వచ్ఛత కార్యక్రమాలతో జరుపుకుందామని సూచించారు. స్వచ్ఛత కేసంగ్ క్యాంపెయిన్ను ఈనెల 8 నుంచి 15 వరకు నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్నామని, జాతీయత, పరిశుభ్రత, పౌర బాధ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కనకాద్రి, ఇంజినీరింగ్ విభాగం ఈఈ రహంతు జానీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంఎస్‌ఎం విద్యార్థులు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రస్థాయి ఆట్యా పాట్యా పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు, నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఎస్‌ఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ హెచ్‌ఎం మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో పీడీ అజయ్‌కుమార్, పీఈటీ రేష్మాలతో కలిసి శుక్రవారం వారిని అభినందించారు. ఈనెల 9, 10వ తేదీల్లో ఒంగోలు ఏబీఎం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ బాల బాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో తమ స్కూల్ నుంచి బాలికల విభాగంలో ఎస్.రిషిత, ఎ.వైష్ణవి, సీహెచ్ నందిని, డి.రిషిత, జి.కీర్తిప్రియ, బాలుర విభాగంలో ఎం.జగదీష్, చంద్రవరుణ్, వై.చరణ్, ఎ.నందగోపాల్ పాల్గొంటారన్నారు.

బాల సంస్కార కేంద్రాలకు రూ.లక్ష విరాళం


నగదు చెక్కును అందజేస్తున్న సీతారామిరెడ్డి

నెల్లూరు(అర్బన్): సింహపురి వైద్యసేవా సమితి (జయభారత్) ఆధ్వర్యంలో గిరిజన కాలనీలలో నిర్వహిస్తున్న బాల సంస్కార కేంద్రాల నిర్వహణకు ఆ సమితి చైర్మన్ పొన్నలూరు సీతారామిరెడ్డి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఆయన తన తల్లిదండ్రులు వీరరాఘవరెడ్డి, రాజేశ్వరమ్మల జ్ఞాపకార్థం నగరంలోని వైద్యసేవా సమితి కార్యాలయంలో ఉపాధ్యక్షుడు బాల సుబ్బారావుకు నగదు చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ గిరిజనుల అభివృద్ధి కోసం విద్య, వైద్య రంగాల్లో ఉపాధినిచ్చేలా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. జయభారత్ ఆస్పత్రిలో గిరిజనుల కోసం ఉచితంగా పది పడకల ఆస్పత్రిని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యసేవా సమితి కోశాధికారి గుర్రం సుధాకర్, జనరల్ మేనేజర్ గురుప్రసాద్, అకౌంట్స్ మేనేజర్ రమణయ్య పాల్గొన్నారు.

ఆటో చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): రెడ్‌క్రాస్ కార్యాలయం ముందు నిలిపి ఉన్న ఆటో చోరీకి గురైంది. వివరాల్లోకి వెళ్తే.. వెంకటాచలం మండలంలోని జోసఫ్‌పేట గ్రామంలో ఆంటోని నివాసం ఉంటున్నారు. ఆయన ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈఏడాది మే 2వ తేదీన ఆయన తన ఆటోలో నెల్లూరు వచ్చారు. ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలోని రెడ్‌క్రాస్ గేటు వద్ద ఆటోను పార్క్ చేశారు. అనంతరం మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసి బయటకు వచ్చిచూడగా ఆటో కనిపించలేదు. అప్పటి నుంచి బాధితుడు ఆటో కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'అప్పులపాలయ్యాను.. నన్ను వెతకొద్దు'

నెల్లూరు(క్రైమ్) : ఓ వృద్ధుడు అప్పులపాలయ్యారు. తనను వెతకొద్దని లెటర్‌రాసి ఎటో వెళ్లిపోయారు. పోలీసుల సమాచారం మేరకు.. కామాటివీధిలో రామచంద్రన్ నివాసం ఉంటున్నారు. ఆయన వీఆర్సీ సెంటర్‌లో ఫ్యాన్సీషాపు నిర్వహిస్తున్నారు. గతనెల 27న ఆయన ఇంటి నుంచి బయటకు వెళ్లారు. కుటుంబ సభ్యులు ఆయన కోసం గాలించినా జాడ తెలియరాలేదు. షాపులో వెతుకగా ఓ లెటర్ లభ్యమైంది. అందులో 'నేను అప్పుల పాలయ్యాను.. నన్ను వెతకొద్దు.. వెళ్లిపోతున్నా..' అంటూ రాసి ఉంది. ఈ మేరకు కుటుంబసభ్యులు శుక్రవారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాగి వైర్ల చోరీ

నెల్లూరు సిటీ: మొగళ్లపాళెం గ్రామానికి చెందిన కె.రాజేష్ పొలంలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీ చేశారు. దీనిపై బాధితుడు శుక్రవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా బోనాల ఉత్సవం


బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

నెల్లూరు(బృందావనం): ఏసీ నగర్ కోదండరామపురంలోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం వార్షిక కుంభాభిషేక మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. తొలిరోజు గో పూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, వరలక్ష్మి వ్రతం, సామూహిక కుంకుమార్చన విశేషంగా నిర్వహించారు. సాయంత్రం పెద్దసంఖ్యలో మహిళలు ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కాశీవిశ్వనాథ స్వామి ఆలయం నుంచి కోదండరామపురంలోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం వరకు 'బోనాల ఉత్సవం' వేడుకగా సాగింది. ఉభయకర్తలుగా కాటేపల్లి వెంకటరమణయ్య, సరిత దంపతులు వ్యవహరించారు. కుర్తాళం పీఠ ఆస్థాన పండితుడు, ప్రధానాచార్యుడు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ పత్తి నరసింహం మాట్లాడుతూ శనివారం ఉదయం కలశస్థాపన, మండపారాధనలు, చండీయాగం తదితర కార్యక్రమాలు జరుగుతుందన్నారు.

రేపు డ్యాన్స్, పాటల పోటీలు



నెల్లూరు(బృందావనం): పురమందిరంలో ఆదివారం 'బిగ్ వేవ్ ఈవెంట్స్' 17 వసంతాల విజయోత్సవ వేడుకల్లో భాగంగా పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ వై.రవిబాబాబు తెలిపారు. కేవీఆర్ పెట్రోలు బంక్ దగ్గర ఉన్న చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్తమాన కళాకారులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే శాస్త్రీయ, వెస్ట్రన్ విభాగాల్లో డ్యాన్స్, పాటల పోటీలు జరుపనున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్వీ రమేష్‌బాబు, నలబోలు బలరామయ్యనాయుడు, నాగిశెట్టి వెంకటరమణయ్య, కె.కృష్ణ, ఎం.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సామగ్రి అందజేత



నెల్లూరు(బృందావనం): తల్పగిరి కాలనీలోని స్వర్ణ దీపం చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమానికి శుక్రవారం దాతలు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సామగ్రిని అందజేశారు. వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ జె.వసుంధర 79వ పుట్టినరోజును పురస్కరించుకుని వీటిని అందించారు. కార్యక్రమంలో డాక్టర్ జె.అశోక్, కుడుముల సుబ్బారావు, ఉపాధ్యాయుడు సుబహాన్, నిర్వాహకులు ఉమ, రఫీ పాల్గొన్నారు.

వెయ్యి మంది మహిళలకు స్మార్ట్ దుకాణాలు


స్మార్ట్‌బజార్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు సిటీ: నగరంలోని వెయ్యి మంది మెప్మా మహిళలకు స్మార్ట్ దుకాణాలు కేటాయించాలన్నది తన లక్ష్యమని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. నగరంలోని మైపాడు గేట్ వద్ద ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ బజార్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలివిడతలో 240 షాపులకు ఆమోదం తెలిపామన్నారు. 120 దుకాణాలను ఈనెలలోనే ప్రారంభిస్తామన్నారు.

- నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో శనివారం పట్టాల పంపిణీ చేయనున్నట్లు మంత్రి నారాయణ అన్నారు. ఈ మేరకు భగత్‌సింగ్ కాలనీలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.
- అల్లీపురంలోని డంపింగ్ యార్డ్‌ను కార్పొరేషన్ అధికారులతో కలిసి మంత్రి నారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

పథకం విజయవంతమయ్యేలా కృషి



నెల్లూరు సిటీ: ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే మహిళలకు ఉచిత బస్సు పథకం విజయవంతం అయ్యేలా కృషి చేయాలని డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ రమేష్ అన్నారు. నగరంలోని నెల్లూరు డిపో–1ను ఆయన సందర్శించి డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బందితో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది మహిళలకు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సునీత, అసిస్టెంట్ ఇంజినీర్ జి.జనార్ధన్ పాల్గొన్నారు.

అమ్మో.. స్పీడ్ బ్రేకర్లు

నగరంలో విచ్చలవిడిగా ఏర్పాటు

నగరంలో ఏ వీధిలో చూసినా రెండు మూడు అంతకు పైగానే స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి ఉన్నారు. ఇందులో కొన్నింటిని నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాటు చేస్తే మరికొన్నింటిని స్థానిక ప్రజలు ఇష్టానుసారం వేసుకున్నారు. అయితే వీటివల్ల కొంత మేలు ఉన్నా.. ఎక్కువగా ప్రజలకు ఇబ్బందులు కలిగించేవిగా ఉన్నాయి.


అవసరం లేకున్నా శ్రీనివాసనగర్ రెండో వీధిలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

నెల్లూరు(బారకాసు): నగరంలో స్కూల్స్, హాస్పిటల్స్, దేవాలయాలున్న చోట మాత్రమే స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కానీ అనేక వీధుల్లో అవసరం లేకున్నా రెండు, మూడు స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేసి ఉన్నారు. వీటి వల్ల ప్రజలు రాకపోకల సమయాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ఎక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉందో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు.

అనవసరం లేకున్నా..

నగరంలోని కొన్ని వీధుల్లో అవసరం లేకున్నా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ఉన్నారు. వీటి వల్ల వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆయా స్పీడు బ్రేకర్లు ఎత్తుగా ఉండడం వల్ల ద్విచక్ర వాహనదారులు వాటిపై నుంచి వెళ్లే క్రమంలో వెన్నుపూసకు ఇబ్బంది కలిగే పరిస్థితి ఏర్పడుతుంది. అంతేకాకుండా వాహనం వెళ్తున్న క్రమంలో సదరు వీధిలోని కుక్కలు వెంబడిస్తున్న సమయంలో స్పీడు బ్రేకర్‌ను గమనించకుండా కుక్కల నుంచి తప్పించుకునే క్రమంలో వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాల బారిన పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పట్టపగలే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటుంటే రాత్రివేళ్లలో ఇలాంటివి అనేకం.

వాటిని తొలగించాలి

అవసరం లేని వీధుల్లో ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకర్లను గుర్తించి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు. వేగాన్ని నియంత్రించేందుకు ఆస్పత్రులు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, పాఠశాలలు ఉన్న ప్రాంతంలో తప్పనిసరిగా స్పీడు బ్రేకర్లు అవసరం. అయితే సాధారణ వీధుల్లో కూడా ఇష్టారాజ్యంగా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి ఉండడం వల్ల ద్విచక్రవాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇకనైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి అవసరం లేని చోట ఉన్న స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.